క్లుప్తంగా

నేడు రెండు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ప్రచారం

అచ్చంపేట: పెదపాలెం, మిట్టపాలెం గ్రామాలలో వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచారం చేపట్టనుంది. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి సారథ్యంలో బుధవారం సాయంత్రం 4 గంటల నుంచి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య తలిపారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ముస్లింల ఆత్మీయ సమావేశం

అచ్చంపేట : స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం 4గంటలకు ముస్లింల ఆత్మీయ సమావేశం జరగనుంది. సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో పాటు కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ పాల్గొంటారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య తెలిపారు. ముస్లిం సోదరులంతా ఆత్మీయ సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

విద్యార్థికి సన్మానం



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన తవ్వ కౌశిక్ పదో తరగతిలో 583 మార్కులతో ప్రతిభ కనబరిచారు. ఈమేరకు ఆర్యవైశ్య యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు, దేవరపల్లి కాశీ విశ్వనాథం, స్వామి ప్రసాద్, తాడువాయి సత్యం, మాచర్ల సత్యనారాయణ, దేవరపల్లి తేజ, తావ్వ శీను, భవిరిశెట్టి హరికృష్ణ, చెక్క రవికుమార్, శ్రీను, తదితరులు ఉన్నారు.

రేపు క్రోసూరులో వైఎస్సార్ సీపీ మహిళా ర్యాలీ

క్రోసూరు: క్రోసూరులో ఈనెల తొమ్మిదో తేదీ సాయంత్రం 5 గంటలకు వైఎస్సార్‌సీపీ మహిళా ర్యాలీ జరుగుతుందని పార్టీ కార్యాలయం తెలిపింది. ఎమ్మెల్యేనంబూరుశంకరరావు సతీమణి నంబూరువసంతకుమారి ఆధ్వర్యంలో ర్యాలీ జరగుతుంది. క్రోసూరు నాలుగురోడ్ల సెంటర్ నుంచి ఎర్రబాలెం నాలుగురోడ్ల సెంటర్ వరకు ప్రచార ర్యాలీ జరుగుతుందని, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ కార్యాలయం పిలుపునిచ్చింది.

ఉరి వేసుకొని ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్య

సత్తెనపల్లి: ఉరి వేసుకుని ఫైనాన్స్ వ్యాపారి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్ లో ఈనెల ఆరోతేదీ రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని 11వ వార్డు లోని పృథ్వి అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్న ఫైనాన్స్ వ్యాపారి తొమ్మండ్రు శివప్రసాద్ (54) గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్‌రోడ్‌లోని తన పాత ఇంట్లో శివప్రసాద్ ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని మృతుడి భార్య అనురాధకు బావ తొమ్మండ్రు పార్థసారథి సమాచారమందించాడు.మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ ఎం సత్యనారాయణ మంగళవారు కేసు నమోదు చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నకరికల్లు: వర్షం కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. మంగళవారం మండలంలో ఎడతెరపి లేకుండా వర్షం కురిసింది. ఈదురుగాలుల ప్రభావంతో నకరికల్లు–మాచర్ల రహదారిపై నర్శింగపాడు వద్ద రోడ్డుపై చెట్టు పడిపోయింది. ట్రాఫిక్ నిలవడంతో స్థానికుల సాయంతో చెట్టును తొలగించారు. సాయంత్రం 5గంటల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 11గంటల వరకు పునరుద్దరణ కాలేదు. దీంతో ప్రజలు అవస్థలు పద్దారు. విద్యుత్ కోతపై ఏఈ నాగసురేష్‌బాబును వివరణ కోరగా 32 కేవీ ప్రధాన లైనులో సాంకేతిక సమస్య తలెత్తిందన్నారు.



సచివాలయ భవనం



రైతు భరోసా కేంద్రం



మండల పరిషత్ పాఠశాల ముఖద్వారం

పెదమక్కెన...ప్రగతి ఓ లెక్కన

- అడుగడుగునా అభివృద్ధి ఫలాలు
- ఐదేళ్లలో మారిన ఊరి రూపురేఖలు
- రూ.3.81 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమానికి రూ.20.59 కోట్లు



సత్తెనపల్లి: 2019 అనంతరం పల్లెల్లో అభివృద్ధి పల్లవించింది. గ్రామస్థాయిలోనే పాలనా ఫలాలు ప్రజలకందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి వజ్ర సంకల్పం సత్ఫలితాలనిస్తోంది. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ఊళ్లు పాలనా నిలయాలయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్థాయిని తలదన్నాయి. రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతల అవస్థలు తీరాయి. విలేజ్ క్లినిక్ ల రాకతో పల్లె ప్రజల ఆరోగ్య ప్రమాణం మెరుగుపడింది. ఇదే తరహాలో అభివృద్ధి ఉరవడి మరో ఐదేళ్లు పరుగులు తీస్తే పాలనా ఒరవడిలో ఓ నూతన శకం ఆరంభం తథ్యం. అప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వైపు యావద్దేశం ఆసక్తిగా చూస్తోంది. పెదమక్కెనలో కనిపిస్తోన్న సంక్షేమాభివృద్ధి ఇందుకు ఓ గొప్ప ఉదాహరణగా నిలుస్తోంది.

2019 –2024 కాలంలో రాష్ట్రంలో గ్రామ స్వరాజ్యం ప్రభవిల్లింది. పల్లెల్లో అభివృద్ధి, మానవవనరుల పురోగతి స్పష్టంగా కనిపించింది. ప్రగతి అంటే పునాదులేసి భవనాలు కట్టడం కాదు, విద్య,వైద్యం, ఆరోగ్యం, కర్షక క్షేమంతో పాటు సకల మౌలిక వసతుల కల్పన మెరుగైనప్పుడే అభివృద్ధికి బీజం పడుతుందన్న మేధావుల మాటల్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిజం చేసి నిరూపించారు. ఓవైపు సంక్షేమం మరోవైపు అభివృద్ధి జోడెద్దులుగా సమతూకం పాటిస్తూ పల్లెలను ప్రగతి బాట పట్టించారు. ఫలితం గ్రామాలు పాలనాలయాలుగా మారాయి. ప్రజలకు ప్రయాసలు తప్పాయి. పెదమక్కెనలో చోటుచేసుకున్న పెను అభివృద్ధి మార్పులే ఇందుకు సాక్షీభూతంగా నిలుస్తున్నాయి.

అంబటి చొరవతో అగ్రగామిగా..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక గ్రామాలు సాధికారతకు చిహ్నాలయ్యాయి. అవినీతికి దూరంగా, రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ ఫలాలను ప్రజల చెంతకు చేర్చడంలో ఆయన పాలన బెంచ్ మార్క్ గా నిలిచిపోతుందనడం అతిశయోక్తి కాదు. సత్తెనపల్లి మండలం పెదమక్కెనలో ప్రగతి పరుగులు పెట్టించేందుకు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కంకణం కట్టుకున్నారు. ఆయన ఆధ్వర్యంలో అభివృద్ధి అదరహో అనిపించేలా తీర్చిదిద్దారు. తమ ఊరిలో ఈమేర పురోగతి జరిగిన తీరును చూసి స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్‌కు జేజేలు పలుకుతున్నారు.

ప్రత్యక్షంగా..పరోక్షంగా సంక్షేమం

ఐదేళ్లలో సంక్షేమ పథకాలకు డీబీటీ, నాన్‌డీబీటీ ద్వారా 6,947 మందికి రూ. 20,59,25,897 ఖర్చు చేశారు. వివరాలిలా ఉన్నాయి.

అందిన తీరు	లబసంఖ్య	సాయం (రూ.లలో)
	5,254	15,21,25,132
డీబీటీ	1,694	5,92,74,453

రూ. 3.81 కోట్లతో అభివృద్ధి పనులు

పాలనా సౌలభ్యత, రహదారులు, పాఠశాలల అభివృద్ధికి ఈ ఐదేళ్లలో రూ. 3.81 కోట్లను ప్రభుత్వ కేటాయించింది. రంగాల వారీ కేటాయింపులను ఓసారి పరిశీలిస్తే..

విభాగం	వెచ్చించినది (రూ. లక్షల్లో)
సచివాలయ భవనం	45
రైతు భరోసా కేంద్రం	21.80
ఎంపీపీ స్కూల్ (బీసీ కాలనీ-నాడు-నేడు)	12
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల	63
ఎంపీపీ స్కూల్	12
సిమెంట్ రోడ్లు	28.50
గ్రావెల్ రోడ్లు	5.50
కచ్చా కాలువలు	6.50
సిమెంట్ కాలువలు	19
కల్వర్టులు	3
గ్రామ పంచాయతీ భవన హంగులు	1
ఎస్‌డబ్ల్యూ పీసీ షెడ్	8.50

పెండింగ్ లో కొన్ని..

జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ తాగునీరందించేందుకు రూ. 1.53 కోట్లు మంజూరు కాగా పనులు జరుగుతున్నాయి. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనానికి రూ.18 లక్షలు మంజూరవగా స్థలం లేక పోవడంతో పనులు ప్రారంభం కాలేదు.

అందరికీ సంక్షేమ పథకాలు



అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పనతో మా ఊళ్లో వచ్చిన మార్పును చూస్తే ఆశ్చర్యపోతున్నాం. రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయి. కరోనా సమయంలో సీఎం జగన్ మోహన్ రెడ్డి అండగా నిలిచారు.

–వద్దుల రామకృష్ణారెడ్డి, గ్రామస్తుడు

మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేదిప్పుడు



గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించడంతో రూపురేఖలు పూర్తిగా మారి పోయాయి. గతంలో నిర్లక్ష్యానికి గురైన ప్రభుత్వ పాఠశాలలను నాడు–నేడు పథకం కింద అభివృద్ధి చెందాయి. ఈ ఐదేళ్లలో మునుపెన్నడూ లేని విధంగా గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందింది. ప్రజలకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రానికి వెళ్లాల్సిన పనిలేదు.

–సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గ్రామస్తుడు, పెదమక్కెన

జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి.



గ్రామంలో మౌలిక సదుపాయాలతో పాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయి. సచివాలయం ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు, రైతు భరోసా కేంద్రం నుంచి అన్నదాతలకు విత్తనాలు, ఎరువులు గ్రామంలోనే అందుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పెదమక్కెనలో అభివృద్ధి అనూహ్య రీతిలో చోటుచేసుకుంది.

–యాంపాటి విజయ కుమారి, ఎంపీటీసీ, పెదమక్కెన



మండల పరిషత్ పాఠశాల భవనం



జలమిషన్ లో ట్యాంక్ నిర్మాణ పనులు



జిల్లా పరిషత్ పాఠశాలలో నాడు-నేడులో నిర్మాణ పనులు

ఓటు హక్కుపై అవగాహన



ముప్పాళ్ళ: నార్నెపాడులో దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఓటు హక్కు పై అవగాహన కార్యక్రమం జరిగింది. సంస్థ మహిళా సమన్వయకర్త మేడే వెంకటరమణ స్థానిక ఉపాధి హామీ వేతనదారులకు ఓటు ప్రాధాన్యతను వివరించారు. ఓటు వేసే ముందు విజ్ఞతతో ఎవరు మంచి చేశారో ? ఎవరితో అభివృద్ధి జరుగుతుందో ఆలోచించాలని కోరారు. కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు వెంకటేశ్ అబ్రహం, ఉపాధిహామీ వేతనదారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్

సత్తెనపల్లి: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల లో మూడోరోజైన మంగళవారం పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. 362 మంది స్థానిక ఉద్యోగులు, 35 మంది ఇతర జిల్లాలకు చెందిన వారు పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కు వినియోగించుకున్నారని సత్తెనపల్లి ఆర్డీవో, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ తెలిపారు.

నేటి నుంచి ఇంటివద్దనే ఓటింగ్

ఈనెల 8నుంచి 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇంటివద్దనే ఓటింగ్ ప్రక్రియ జరుగుతుందని రిటర్నింగ్ అధికారి వి. మురళీ కృష్ణ తెలిపారు. మొత్తం ఎనిమిది బృందాలను ఏర్పాటు చేశామన్నారు. నియోజకవర్గంలో 85 ఏళ్ల పైబడిన వృద్ధులు 133 మంది, దివ్యాంగులు 130 మంది మేర మొత్తం 263 మంది హోం ఓటింగ్ రూపంలో ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు ఆయన తెలిపారు.

రమాదేవికి కవనతేజం పురస్కారం



సత్తెనపల్లి: పట్టణానికి చెందిన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ సరికొండ రమాదేవికి గౌతమేశ్వర సాహితి కళా సేవా సంస్థ కవన తేజం పురస్కారాన్ని ప్రదానం చేసింది. నాలుగో వార్షికోత్సవ సందర్భంగా ఈ నెల 5న తెలంగాణాలోని పెద్దపల్లి జిల్లా మంథనిలో 'కవన తేజం పురస్కార పత్రం తోపాటు 'సాహితి చంద్రిక' బిరుదు, 'కలం అవార్డ్' ప్రదానం చేశారు. సాహితి కళా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు దూడపాక శ్రీధర్, ప్రముఖ కవి ప్రభాకర్, వేణు, వరలక్ష్మి చేతుల మీదుగా 60 కవితల జాతరలో రచనలకు రమాదేవిని ఎంపిక చేశారు. ఈమేరకు పురస్కార గ్రహీతను పలువురు అభినందించారు.

అంబటి సమక్షంలో చేరిన టీడీపీ కుటుంబాలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: కొమెరపూడిలో టీడీపీకి చెందిన 13 కుటుంబాలు గ్రామ సర్పంచ్ కొరివి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం ఆ పార్టీకి గుడ్ బై చెప్పారు. వైఎస్సార్ సీపీలో చేరేందుకు రాగా వారిని మంత్రి అంబటి రాంబాబు సాధరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. కొమెరపూడికి చెందిన గొర్రెముచ్చు జయన్న, బొడ్డేటి కుమారి, మాచర్ల సాగర్, గోపాల. రాజేశ్వరిల ఆధ్వర్యంలో 13 కుటుంబాలు వైఎస్సార్ సీపీ బాటపట్టాయి. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజ నారాయణ, వ్యవసాయ సలహా మండలి రాష్ట్ర కమిటీ సభ్యుడు కళ్ళం విజయభాస్కర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

బెల్లంకొండ: రామాంజనేయపురం, ఎమ్మాజీగూడెం గ్రామాలకు చెందిన టీడీపీ కార్యకర్తలు, నాయకులు ఎమ్మెల్యే నంబూరు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. రామాంజనేయపురం గ్రామానికి చెందిన రమావతు సేవానాయక్, స్వామినాయక్, మూడావతు రమేష్‌నాయక్, లోటావతు శుక్రునాయక్ లున్నారు. ఎమ్మాజీగూడేనికి చెందిన 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. చంద్రాజుపాలేనికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఎంపీపీ పద్మా వెంకటేశ్వరరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. కార్యక్రమంలో జటావతు తులసీ నాయక్, మారం ప్రసాదరెడ్డి, చిట్టిబాబు, నారుమళ్ల రామకోటి, గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ప్రచారం



రాజుపాలెం: మండలకేంద్రంలోని రాజుపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీతో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింట తిరిగి సంక్షేమాభివృద్ధిని వివరించారు. సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనీల్ కుమార్‌యాదవ్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో సర్పంచ్ పులిబండ్ల అశోక్, జీడీసీఎంసీ డైరెక్టర్ పాలవాయి ఆదినారాయణ, మొర్రిబోయిన వెంకటప్పయ్య, జంగం నరసింహారావు, కేదారి నాగేశ్వరరావు, చెవుల స్వామి, పొత్తూరి నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

మేనిఫెస్టోతో ప్రజల్లో నమ్మకం పెరిగింది

- నరసరావుపేట వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి అనికుమార్ యాదవ్
- పెదకూరపాడు ఆత్మీయ సమావేశానికి భారీగా హాజరైన కార్యకర్తలు
- ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించిన ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, పక్కనే ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మేనిఫెస్టోపై ప్రజల్లో మరింత నమ్మకం పెరిగిందని నరసరావుపేట వైఎస్సార్ సీపీ లోక్ సభ అభ్యర్థి డాక్టర్ పి. అనిల్ కుమార్ యాదవ్ అన్నారు. గత మేనిఫెస్టోని పవిత్రంగా భావించిన సీఎం జగన్ 99శాతం హామీలు నెరవేర్చారని, వాటిని కొనసాగిస్తూ అదే స్ఫూర్తితో మరికొన్ని హామీలతో నూతన మేనిఫెస్టో తీసుకురావడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని వ్యాఖ్యానించారు. మండలకేంద్రమైన పెదకూరపాడులో నిర్వహించిన వైఎస్సార్ సీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ముందుగా పార్టీ కార్యకర్తలు తమ నాయకులను భారీర్యాలీగా ఆహ్వానం పలికి, గజమాలతో సత్కరించారు. స్థానిక మహిళలు హారతులిచ్చి అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అనికుమార్ యాదవ్ మాట్లాడుతూ సీఎం జగన్ ఆచరణలో సాధ్యమయ్యే హామీలనే ఇస్తారన్నారు. 2014లో ఇవే పార్టీలతో కూటమిగా జతకట్టిన చంద్రబాబు 600హామీలతో మేనిఫెస్టో ప్రకటించి అందలం ఎక్కాక ఆ మేనిఫెస్టోనే మాయం చేశారని విమర్శించారు.

ఇప్పుడు మళ్లీ మోసం చేయడానికి సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ మీ ముందుకు వస్తున్నారని, టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులకు ఓటుతో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి రావడానికి చంద్రబాబు ఎవరితోనైనా జతకడతారని విమర్శించారు. జగన్ సీఎంగా ఉంటే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు.

అమరావతి–బెల్లంకొండ రహదారి కలను నిజం చేశా : ఎమ్మెల్యే నంబూరు

కలగా మారిన అమరావతి – బెల్లంకొండ మూడు లేన్ల రహదారిని నిజం చేసి చూపించానని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మాదిపాడు వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చాయని, టెండర్లు కూడా పిలవడం పూర్తయిందన్నారు. మళ్లీ జగన్ సీఎం అయిన వెంటనే నిర్మాణ పనులు చేపడతానని తెలిపారు. మరోసారి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా అనికుమార్‌యాదవ్‌ను ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గతం కంటే అధిక ఆధిక్యతతో విజయం చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



గజమాలతో స్వాగతం పలుకుతున్న అభిమానులు

హోరు గాలులు..జోరుగా జల్లులు

నకరికల్లు: పదిరోజులుగా నమోదవుతున్న 40 డిగ్రీల ఉష్ణోగ్రతలకు మంగళవారం ఉపశమనం లభించింది. మోస్తరు కురిసిన జల్లులకు ప్రజలు ఊరట చెందారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంతో జనాల్లో హర్షాతిరేకాలు వెల్లువెత్తాయి. ఒక్కసారిగా నల్లగా మబ్బులు కమ్మి ఈదురుగాలులు ప్రారంభమవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో అందరూ హమ్మయ్యా అంటూ ఊపిరిపీల్చుకున్నారు. ఓ సమయంలో గాలుల వేగానికి వర్షం తేలిపోతుందని అనుకుంటున్నంతలో వర్షం ప్రారంభమైంది. అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై వర్షపు నీరు నిలిచింది.

క్రోసూరులో జోరున గాలివాన

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఎండలతో అల్లాడిన ప్రజలు ఒక్కసారిగా ఉరుములు,మెరుపులతో జోరున గాలివాన ప్రారంభమైంది. అరగంట పాటు కురిసిన వర్షంతో పొలాలు, వీధుల్లో నీరు చేరింది.

నేలమట్టమైన బొప్పాయి తోటలు

రాజుపాలెం : మండలంలో మంగళవారం వీచిన ఈదురు గాలులకు పలు చోట్ల తోటలు దెబ్బతిన్నాయి. మొక్కపాడు గ్రామంలో మాగంటి నాగేశ్వరరావు, మాగంటి పుల్లయ్యలకు చెందిన 4 ఎకరాల బొప్పాయి తోటలు నేలమట్టమయ్యాయి. సుమారు రూ.4.50లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేపో మాపో పంట తొలి కోతకు వస్తుందనుకున్న తరుణంలో ఇలా జరగడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. గణపవరం, అంచులవారిపాలెం, అనుపాలెంలో అరటి తోటలు దెబ్బతిన్నట్లు రైతులు తెలిపారు.



మొక్కపాడులో నేలమట్టమైన బొప్పాయి తోటలు



సర్వీసురోడ్డులో కురుస్తున్న వర్షం

టీడీపీకి టాటా...వైఎస్సార్ సీపీ బాట



ఎమ్మెల్యే నంబూరు సమక్షంలో టీడీపీ నుంచి తిరిగి పార్టీ గూటికి చేరిన క్రోసూరు కార్యకర్తలు

క్రోసూరు: క్రోసూరుకు చెందిన విప్పర్ల శ్రీను, విప్పర్ల చిట్టిబాబు, షేక్ యాసిన్ లు ఇటీవల టీడీపీ నేతల ప్రలోభాలకు లొంగి ఆ పార్టీలో చేరారు. కానీ పశ్చాత్తాపంతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో తిరిగి సొంతగూటికి చేరారు.

వైఎస్సార్‌సీపీలోకి బయ్యవరం టీడీపీ శ్రేణులు

బయ్యవరం(క్రోసూరు): క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన 20 కుటుంబాల టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పెదకూరపాడు నియోజకవర్గ శాసనసభ్యులు నంబూరు శంకరరావు సమక్షంలో వారు పార్టీ బాట పట్టారు.